సోములి ఇల్లు సందడి సందడిగా ఉందారోజు. అంతకు ముందురోజే దేశమెల్లి సరుకేసుకొచ్చాడు. పొద్దు పొడిచేసరికే ఒక్కొక్కళ్ళు పోగవుతున్నారు.

"ఎప్పుళ్ళొగిశారు ఎప్పుడొండుకు తిన్నారల్లా?" నవ్వుతూనే విసుక్కుంది సోములి పెళ్ళాం రత్నం. సోములు సరుకున్న బస్తాలన్నీ వసారాలో వేశాడు. తరాజు, తాటాకు బుట్టలు దగ్గర పెట్టుకుని ఎత్తుపీట వేసుకుని కూర్చుంది సోములి అత్త పెంటమ్మ. బస్తా కున్న పురికొస లాగి, బోర్లించాడు సోములు.

ఉండలు ఉండలుగా తుట్టలు కట్టుకున్న వెంట్రుకలు అదో రకం దుర్వాసనతో బయటపడ్డాయి. ఒక వుండ తీసి వాసన చూసి పోగులోకి విసిరి కొట్టింది పెంటమ్మ.

"మరీ నాశిరకం. అందులోనూ తడిపారు తూకాని కొత్తయ్యని!" గొణుక్కుంది పెంటమ్మ.

# పోటుచూస్తే - ఆటు

డి. సుజాతాదేవి

"ఆ! ఇక్కడ కూసుని కబుర్లు సెప్పడం గాదు. అక్కడకొచ్చి బేరం జేత్తే తెలుత్తది. ఎన్ని సోట్ల దిరిగి వాకబుజేత్తేనో ఈ రేటు కియ్యి దొరికినై" నిర్లక్ష్యంగా అన్నాడు సోములు.

తల్లిమాటలు విన్న రత్నం కూడా ఒక ఉండ తీసుకుని విడదీసి చూసింది. మరీ గట్టిగా చుట్టుకపోయి మట్టికొట్టుకుని ఉన్న వాటిని చూసి రత్నానికి కూడా కోపం వచ్చింది.

"ఓ....సవకబేరంజేసుకొచ్చానని సంబర పడిపోతున్నావు. ఇయ్యి పీకేతలికి ముక్కముక్కలై పోయి లాబం గూబల్లోకొత్తది" మొగుడికేసి ఉరిమిచూస్తూ అంది రత్నం.

"సర్లే బేగి తూసిపడెయ్యండమ్మా. మీ లాబం మాటేమోగాని ఇయ్యి పీకేతలికి మా గూడలు పడిపోతయ్యి" అంది మంగమ్మ.

ఒక కిలో ఉండలు తూచి మంగమ్మ బుట్టలో వేసింది పెంటమ్మ.

"ఉంకో అరకిలో ఎయ్యి."

"అయ్యిపీకోలి మాటకారి మంగమ్మ. నీకాళలావు. పీక సన్నం" విసుక్కుంటూనే మరో అరకిలో తూచి వేసింది పెంటమ్మ.

"యామని పెట్టారోగాని ఆ పేరు ఎంత కమ్మటి నోరో నా తల్లిది" గొణిగింది మంగమ్మ.

అందరూ తలా ఒక కిలో వేసుకుని ఆ వసారాలోనే తలో పక్కా కూర్చున్నారు. ఒకళ్ళిద్దరు ఇళ్ళకు తీసుకెళ్ళారు. ఉన్నవాళ్ళు కాసిని కాసిని వెంట్రుకల వుండలు ముందు పోసుకుని గట్టిగా చుట్టుకుపోయిన వాటిని దూదిపింజినట్లు విడదీసి పోగుబెడుతున్నారు.

అంతకు ముందు వ్యవసాయ కూలీగా వుండగా గోచీకెక్కువ-గోవంచాకు తక్కువగా సాగుతున్న సోములి సంసారం వెంట్రుకల వ్యాపారం పెట్టాక పచ్చగా వుండటమేకాక పదిమందికి కూలి దొరుకుతూంది. ఆ చిన్న పల్లెటూరిలో అయిదుగురు ఆ వ్యాపారం చేస్తున్నారు. పొలం పనులు చేయలేని చిన్నపిల్లలైనా, కన్ను కాలు అవుడైన ముసలివాళ్ళయినా నీడ పట్టున కూర్చుని రోజుకో కిలో పీకితే రెండు రూపాయలొస్తాయి. అట్లా పీకిన వాటిని పింజ దీసి, సైజులు వేరుచేసి కట్టలు కడితే కిలోకి ఎనిమిది. సవరాలు కట్టడం వచ్చిన వాళ్ళకు పనిలో వేగాన్నిబట్టీ, నేర్పునిబట్టి ఇంకా ఎక్కువే.

"ఇయాల కన్నమ్మింకా రాలేదేంటే? తెల్లారేసరికి పచ్చిపడేది" అంది పెంటమ్మ.

"ఏలూరెళ్ళింది".

"యాంపని?"

"మునుపెల్లి నప్పుడెప్పుడో అన్నారంట రెణ్ణెల్లలో సిట్టిపాప ఒత్తాదని. ఎప్పుడొత్తదో అడిగిరాటాని కెల్లింది" అంది మంగమ్మ.

"మొత్తానికా పిల్లమీద పంచపేణాలు. అమ్మ దీని బెమత పాడుగానో అరికాలికి మట్టి గానిచ్చేదా, అగ్గి దగల్నిచ్చేదా!" అంది సూరమ్మ.

"మా సిట్టిపాప మా సిట్టిపావని తెగజెప్తాద్ది కన్నమ్మామ్మ. ఆ పిల్లేపవుద్దసలు" అడిగింది కొత్తగా కాపరానికొచ్చిన రామతులసి.

"అదా. సెప్పాలంటే శానా కతుంది"



అని గొంతు సవరించుకుంది మంగమ్మ.

కాస్త దూరంగా కూర్చున్న వాళ్ళు కూడా వెంట్రుకల పోగులు నెట్టుకుంటూ దగ్గరకు వచ్చారు. అసలు మంగమ్మ ఏ విషయం చెప్పినా అలాగే చెవులు దోర బెట్టుకుని వింటారు. ఆవిడ కథా కథన చాతుర్యం అటువంటిది. ఎప్పుడైనా ఏడాదికో రెండేళ్ళకో ఓ సినిమా చూసివస్తే రాత్రి భోజనాలయాక చుట్టూ పదిమందిని కూచో బెట్టుకుని స్వాగతం దగ్గర్నుంచీ శుభం వరకూ ఒక్క కదలిక దీరుపోకుండా. వాళ్ళనేమాటలే కాక ఆలోచనలు కూడా ఊహించి ఊరించి ఊరించి వారం రోజులు చెబుతుంది. వాళ్ళు ఏకబుర్లు చెప్పుకుంటున్నా చేతులు మాత్రం చక చక వెంట్రుకలు చిక్కులు పీకి ఓ పక్కకు నెడుతున్నై. కొందరు పమిట చెంగులు తలమీది నుంచి ముందుకు లాక్కుని ముక్కు మీదుగా వెనక్కు వేసుకున్నారు— దుర్వాసనా రోజు భరించలేక.

మంగమ్మ మొదలుబెట్టింది కథలా.

"నేను కాపరాని కొచ్చేతలికే మూడు సార్లు కడుపు కాల్చుకుంది కన్నమ్మ. అవడానికి నా కత్తపరసైనా, నాకన్నా రెండు మూడేళ్ళే పెద్దది. పేరుకు మొగుడు మాసిన మావకాని అత్త, ఆడబిడ్డ, అసలు మొగుళ్ళు. మా మావకు ముందు సమందం పిల్లలిద్దరూ చెరోసోట తిరపడిపోయారు. కత్తిమీద సాములాగా కాపరం జేసింది కన్నమ్మ. ఏదో పడ్డోళ్ళు సెడ్డోళ్ళు గాకపోయినా పోయినోళ్ళు మంచోళ్ళనాలి. ఆళ్ళ కాలం చెల్లింది. ఆళ్ళెల్లి పోయారు. కన్నమ్మ ఒంటిగా మిగిలిపోయింది. తండ్రి కరమల కొచ్చిన కూతురూ కొడుకూ పొలం పుట్రా అమ్ముకొని పరిచుకుపోయారు. ఇల్లొక్కటి మిగిలింది కన్నమ్మకు."

"ఇంతకీ ఈ సిట్టి పాపెవరు?" అసలు సంగతి చెప్పమన్నట్లు ఆత్రంగా అడిగింది రామతులసి.

"అదే అదే సెప్తున్నా. ఎప్పుడి మాట ఇరవై ఏళ్ళు దాటిపోయింది. కన్నమ్మకో ఆడబిడ్డుండేదని సెప్పాను కాదు. ఆవిడ కొడుకు ఎంకటసెలం. ఏలూరులో గవరమెంటాపీసులో ఉజ్జోగం. అదిగో ఆడి కూతురే ఈసిట్టి. సిట్టి కేడాది దిరక్కుండానే తల్లి జచ్చింది. అప్పుడు కన్నమ్మే పెద్ద దిక్కుగా ఆదరించి ఓదార్చింది. సేయితులంతా పట్టుబట్టి మూడుమనువు జూశారు సెలానికి. అయినింటిపిల్ల. సదుంకున్నది. సక్కందీను. ఆ పిల్ల కాపరాని కొచ్చి రాంగానే సిట్టిముండ బాజీతప్పజెప్పడానికి సిన్నతనవనిపించింది సెలానికి.



ఏదో కొత్త పెళ్ళాం పాతబడేదాకా ఆ పిల్లనెవరు పెంచుతారా అని పారజూత్తే అటూ యిటూ ఎవళూ కనపడలే కన్నమ్మ తప్ప. అసలు పెళ్ళిసూపులప్పుడే బిడ్డ తండ్రిని జేత్తన్నారు న్నాకని ఆవిడగారు కళ్ళమ్మట కారిసిందంట. నీకెందుకు, పిల్ల బాదరబందీ నీకుండదూ అని మాటిచ్చి మరీ సేసుకున్నాడంట. అదిగో ఆ రకంగా కన్నమ్మ కాళ్ళ కడ్డంబడింది సిట్టి. అట్టా ఏడాది పిల్లను దెచ్చి ఆరేళ్ళొచ్చేదాకా కళ్ళల్లో బెట్టుకు సాకింది కన్నమ్మ.

ఆ పిల్లనిక బళ్ళో ఎయ్యాలని అళ్ళ నాన తీసికెల్లిన్నాడు దానేడుపంతా ఇంతా కాదు. పీనుగెల్లినట్టు ఖాయిలాపడిపోయింది".

"ఏడిసిందంటే ఏడవదామరి! ఆ పిల్లిక్కడ ఉన్నన్నాళ్ళూ వైభోగం కిందుండేది. పైసా పాటుబడలేదు. సమస్తం తెచ్చి పడేసేవాడు." అక్కసుగా అంది సూరమ్మ.

"బుద్దిపోనిచ్చుకున్నావు కాదు, సుప్పనాతి సూరక్కా! ఆడూ, నువ్వూ పెడితేనే తింటుందా ఎల్ల కాలమూ. అప్పట్లో పిల్లను తీసికెళ్ళాక కూడా నెలనెలా పదో పరకో పంపించేవోడు. తరవాత్తరవాత ఎప్పుడో సూత్తానికొచ్చి పాతికో ముప్పయ్యో సేతిలో పెట్టేవోడు. పిల్ల కూడా ఆస్టలికి సెలవులిచ్చినపుడల్లా వొచ్చి నాలుగు రోజులుండెల్లేది. రాను రాను ఇప్పుడా పెట్టుపోతలూ లేవు రాకపోకలూ లేవు. తల్లితరుపు ఆత్తి బాగానే వచ్చింది సిట్టికి. మంచి సమందమే చేశాడు. ఉప్పుడిద్దరు పిల్లలు, మొగుడికి డిల్లిలో ఉజ్జోగం. ఆళ్ళొత్తన్నారంటె సాలు కన్నమ్మకు ఒళ్ళు తెలవదు, ఒంటిమీద గుడ్డ నిలవదు."

మంగమ్మ కథ ముగించకముందే.

"అదిగో కన్నమ్మా మొత్తచ్చేత్తంది." అంది రామతులసి.

ఒక చేతిలో సంచీ, ఒక చేతిలో కొత్తగా రంగువేసిన ముక్కాలిపీట పట్టుకుని ఊగి ఊగి నడుస్తున్నది కన్నమ్మ.

వచ్చేసింది. నల్లగాపొగ కట్టెలా ఎండిపోయి, సన్నగా ఈత జువ్వలా వొంగిపోయి. ఉన్న కన్నమ్మ మరింత వొంగి వసారాలోకొచ్చి కూర్చుంది.

"కాసిని సల్లటి మంచినీళ్ళియ్యేరత్తమ్మా" అంది కన్నమ్మ సాలిదీచ్చుకుంటూ.

"ఏంటత్తా మా సిట్టిపాప సంగతులు." అడిగింది మంగమ్మ.

"యామున్నయ్యమ్మా! తల్లీ పిల్లలూ, బాగానే వున్నారంట. వచ్చేనెల ఇరవై తిని మిదో రోజు నొత్తారంట. మా సెలంపెళ్ళాం కరుగ్గా మాటే సెప్పదమ్మా. ఒకటి మాటాడితే తక్కువ, రెండాడితే ఎక్కువ. ఆవిడితో నేనేమడుగుతాను కాసేపు కూచునొచ్చేశా."

"పీటను పెళ్ళికూతుర్ని చేశావేంటి మామ్మా" అంది రామతులసి.

"అదా, మా బుజ్జవొచ్చాక, ఇద్దామని రంగేయిచ్చుకొచ్చా. ఆళమ్మ సిన్నప్పుడు దానిమీద కూసో బెడితేనే అన్నం తినేది. తాన్నం జేసేది"మురిపెంగాఅంది కన్నమ్మ.

"ఎంత సక్కగేశాదేరంగు, పైన పువ్వు కూడా ఏశాడు. కొత్త పీటలాగుంది" అంది పెంటమ్మ.

"అవునే, నన్నక్కడ నుంచోబెట్టి సిటుక్కన ఏసిచ్చాడు. ఇట్టాటి విద్దెలు నేరిసినోళ్ళదే జనమ.మనవూ ఉన్నాం ఎంత సేపూ దుక్కిటెద్దుల్లా కట్టపడత వేగదా?" పీటమీద గులాబీపువ్వును ముచ్చటగా చూస్తూ అంది కన్నమ్మ.

"అట్టనమాకులే అత్తా,చేసే నేరుపుండాలి గాని ఏ పని జేత్తేనేంటి. మనకోటిగాడు, పింజలు దీత్తాడంటే, ఒక్క ఎంటికైనా ముక్కలవనిత్తాడా? ఎంత సురుగ్గాజేత్తాడో, అంతందంగా జేత్తాడు. అదీ ఆ పారవతి సగరం కట్టిందంటే యెట్టుంటది? మినను పనేగాని సేతిపని లాగుండదు. మనం జూసు పొద్దుగ్గూకులూ కూసుని ఈసెదు "బొమ్మ బీకే" తలికి గగనమైపోతంది. దానికే సందలదేతలికి రెక్కలు పులిసిపోతన్నై" అంది మంగమ్మ.

"అది సరేగాని మంగమ్మా! ఈ పాలి మా సిట్టి పాపచ్చేతలికి అరిసిలొండాలే" అంది కన్నమ్మ మాట మారుస్తూ.

"సీకెందుకొచ్చిన పిచ్చే బాబూ. ఆళ్ళు కావాలంటే కొనుక్కుతినలేరా? ఏదో కాలూ సెయ్యీ ఆడతంది గనక కట్టపడి 'బొమ్మ పీకి' రూపాయి డబ్బులు సంపాయిత్తన్నావు. ఒక పావలా తిని పైసా ఎనకుంచుకోపోతే ఎట్టా" అంది పెంటమ్మ.

"పోనివ్వే పళ్ళొచ్చిన కాణ్ణుంచి పప్పులు దింటన్నాం. కాళ్ళొచ్చిన కాణ్ణుంచి కట్టపడతన్నాం. అది పొట్టలో ఉంటందా? ఇది పెట్టెలో వుంటుందా? బిడ్డా పాపా వున్నదానివి నువ్వు కూడా అట్టంటావేమే" అంది కన్నమ్మ!


కోటి వాళ్ళంతా విడదీసి పెద్దపెద్ద ఏకుల్లా చుట్టిన వెంట్రుకలను యాకిలికి పెట్టి పింజ దీసి సైజుల వారీగా కట్టలు కడుతున్నాడు. వసారాలో చివరగావున్న పొయ్యిమీద తెల్ల వెంట్రుకలను నల్ల రంగులో వేసి ఉడకబెడుతున్నాడు సోములు.


వాళ్ళతో మాట్లాడుతూనే చకచక పని చేసుకుంటున్న కన్నమ్మ ఆలోచనల్నిండా చిట్టి పాపే. చిట్టిపాప తప్పటడుగులు, చిలక పలుకులు, గారాలు, మారాలు—బళ్ళో ఏసిన్నాటి బాధ, పెళ్ళినాటి ముచ్చట—అన్నీ కళ్ళల్లో మెదులుతున్నై.

"నిన్నగాక మొన్న జరిగినట్టుందిదంతా, మొన్న తప్పటడుగులపిల్ల, నిన్న పెళ్ళి కూతురు, ఇయ్యాల ఇద్దరు బిడ్డల తల్లి! ఏంటో కాలం ఇరుసుమీద శక్రంలాగ కరాకరా కదిలిపోటమేగదా" అనుకుంది కన్నమ్మ.

అట్లా అవే ఆలోచించుకుంటూ పని చేసుకుపోతున్న కన్నమ్మ మనసులోకి, బెదురు బెదురుగా ఒక ఆలోచన జొరబడింది. వెంటనే అది బలం పుంజుకుని నిముషాలమీద తిరుగులేని నిర్ణయంగా మారింది.

ఆలీ మొగుడూ కట్టుబడి కూలీ నాలీ జేత్తన్నా, గోసీకెక్కువ గావంచాకు తక్కువగా, కటకటలాడిపోయేవోళ్ళు పెంటమ్మ పున్నెమా అని జిగినీ గొలుసు తాకట్టుబెట్టి ఎయ్యిరూపాయలు తెచ్చి ఎంటికల యాపారం బెట్టిచ్చింది సోములితో. ఇప్పుడు జూడాలాటు సెలో అంటే సెట్లు






కాస్తనైనా. తనుకూడా ఎవళితోనన్నా దేశం నుంచి సరుకు తెప్పించుకుని పని చేయించాలి. సిట్టిపాపొచ్చే తలికి బుడ్డదాని కేమన్నా చేయించివ్వాలి.

'ఎంత పేమ వుంటేనేంటి పెడితేనే పేరుం దేది.

"ఇది మా మామ్మిచ్చింది" అని పిల్లలు సెప్పుకోవాలి!' అనుకుంది కన్నమ్మ. ఆ క్షణంనుంచే పెట్టుబడికోసం ఆలోచన మొదలుబెట్టింది.

సాయంత్రం ఇంటికెల్తా కోటిగాడి చెవిలో ఓ మాట వేసింది. ఆడింటి దాకా వచ్చి అతిచేతిలో స్వర్గంలా లాభాలు చూపించి వెళ్ళాడు. ఆనక మంగమ్మను పిలిచి అడిగింది.

"అయ్యో నీకెందుకత్తాఅయ్యన్నీ. వచ్చే వయసా పోయే వయసా? ఏదో ఓపికున్ననాడు 'బొచ్చుపీకి' ఓ రూపాయి డబ్బులు తెచ్చుకుంటన్నావు. లేన్నాడు కడుపులోకాళ్ళెట్టుకు పడుంటన్నావు. యాపారమంటే మాటలా" అని హితవు చెప్పెళ్ళింది. కాని కన్నమ్మకు తెల్లార్లూ అదే ఆలోచన.

తెల్లారకముందే వచ్చి పడ్డాడు కోటి. ఇల్లు తనఖా పెడితే వీరభద్రం అప్పు ఇస్తానన్నాడనీ, అతడే దేశమెల్లి సరుకు నాణ్యం చూసి తెస్తాననీ వార్త మోసుకొచ్చాడు.

ఎందుకైనా అంత్య నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మంచిదని సోములి తోనూ చెప్పింది తన నిర్ణయం.

"ఆడిదగ్గరా, ఈడిదగ్గరా ఇల్లు బెట్టడ మెందుకు? ఆ ఈరబద్రాని కెప్పుణ్ణించో నీ ఇంటిమీద కన్నుంది. నేను సర్దుతాలే" అన్నాడు సోములు ఉదారంగా. "ఎవుణ్ణి షంపిచ్చినా బోలెడు కరుసులవుతాయి. నాకైతే పనిలోపని.. నేనే తెచ్చిపెడతాలే సరుకు" అన్నాడు.

"అట్టాగేబాబూనీయిట్టం" అందికన్నమ్మ ఆనందంగా.

అల్లుడి భరోసా చూసి పెంటమ్మ మండి పడింది.

"నీ కెందుకబ్బాయా! సరుకు జూతే తేపకో రకంగా వుంటుంది. మనకైతే లాబమో నట్టమో కట్టుకుంటాం. కట్టమో సుఖమో అనబగిత్తాం. బయటోల్లకు తేట మంటే మాటలా" అంది.

"ఒసె పెంటీ నువ్వూరుకోవే నేనేమంత పరాయిదాన్ని కాదుగాని, సోములా.... నీ కెందుకు నీ సొంత పనే ననుకో. అయ్యా అక్కడున్నదేదో తీసుకురా. నువ్వేం తెలివి తక్కువోడివా!" అంది కనకమ్మ.

"అవున్లే గోవుల్లేనూళ్ళో గొడ్డు గేదె సీమాలక్షిమి." అని నవ్వింది రత్నం.

మూడొందలు మించితే వద్దంది కన్నమ్మ.

నాలుగు రోజులు గడిసినై. "నా కుప్పు డప్పుడే ఒద్దు. నీ కరిజంటుకదా, ఎల్లు" అని దేశ మెల్లాడు సోములు. మూటలిప్పే సరికి గుండె బేజారైంది కన్నమ్మకు. నాలుగైదేళ్ళుగా పనిచేస్తుందిగాని అట్లాంటి సరుకెక్కడా చూడలేదు కన్నమ్మ. ఏమన్నా అన్నా అక్కడున్నద దేనంటే చేసేదేముందనుకుని మారు మాటాడకుండా ఇంట్లో వేయించుకుంది కన్నమ్మ. "ఆడికీ తెచ్చుకునే ఉంటాడు. అది మంచి సరుకేమో బైట పెడతల్లే" అంది మంగమ్మ.

చిట్టిపాప కూతురు, జుమికీలు, పాంజేబులు పెట్టుకుని గిలుకూ గిలుకూ గిలక్కాయలా తిరుగుతున్నట్టే వుంది కన్నమ్మకు. రెండురోజులు గడిచినై. దాచుకున్నదేదో కొంచెముంటే యిద్దరు మనుషుల్ని పెట్టుకుని తను రాత్రీ పగలూ కష్టపడుతూ పీకిస్తోంది కన్నమ్మ. కాని పింజదీయించాలంటే చాలా డబ్బు కావాలి. అందుకనే రెండొందలిమ్మని సోముల్నడిగింది. ఇంకెక్కడ తెచ్చిత్తానంటూ కాసేపటికే కాయితం వ్రాయించి ఇద్దరు పెద్దమనుషుల్ని వెంటబెట్టుకుని వచ్చాడు సోములు.

సంతకం పెట్టమంటే తెల్లబోయి నోరెళ్ళబెట్టి "ఎందుకయ్యా" అంది కన్నమ్మ.

ఇల్లు తనఖాపెట్టి సోములు దగ్గర ఏడొందలు తీసుకున్నట్టు చదివి వినిపించారు పక్కనున్న పెద్దమనుషులు.

"అదేంటయ్యా. మూడొందల సరుకేగా తెమ్మన్నది" అమాయకంగా అంది కన్నమ్మ.

"ఆ... నువ్వన్నట్టే ఒత్తదా. అక్కడ అయిదొందలు సరుకొన్నాను. రెండొందలు ఖరుసులైనై" అన్నాడు సోములు.

"ఖరుసు లొద్దన్నావుగా?"

"అంటే.... నా సేతియి బెట్టుకోమనా నువ్వనేది. నాకూ తెచ్చుకుంటే తెద్దామనుకున్నా. నువ్వు నిలబడ్డావా?" ఉరిమినట్టే అన్నాడు సోములు.

"అదేంట్రా సోములా, ఏడొందలప్పు రాయించుకున్నావు. నా కెవ్రని ఏగావీ యివ్వలేదు. అయ్యి జూత్తే పీకుతుంటేనే సేతకీ కాలికీ రాకుండా ముక్కలు, సెక్కలై అంతా రద్దే తేలేట్టుంది. ఆటిమీద ఏమొత్తయ్యో సత్తయ్యో సోకెట్టి పని చేయించన్నా.." ఏడుపుగొంతుతో అంది కన్నమ్మ.

"ఏమో ఏంబెట్టి చేయించుకుందామనుకున్నావో నాకెందుకు. ఏదో అడిగావుగదాని నిన్ను కానీ అడక్కుండా సరుకు దెచ్చిపెడితే పైన ఇదా."

"అయ్యో.... ఆ జానాబెత్తా బొచ్చెవడు గొంటాడు...ఇదే వన్నాయంరా." అంది కన్నమ్మ. అప్పుడే అక్కడకొచ్చిన రత్నం రవరవలాడింది.

"ఏం....ఉప్పుడు తెలిసిందా... ఏదో మీ రెక్కల కట్టంమీద మేం బతికిపోతన్నామనేగా నువ్వు యాపారంలో ఏలెట్టావు. పైగా అప్పు ఇచ్చినోళ్ళ దన్నాయమా" అంటూ రంకెలేసింది. పోసీతే అయిపోయిన పెళ్ళికి బాజాలెందుకు అని ఒణికే చేతుల్తో వేలుముద్ర వేసింది కన్నమ్మ.

ఇంత పనిచేయించాలి. చేతిలో డబ్బు లేదు. తను కాపరానికొచ్చేటప్పుడు పట్టుకొచ్చింది– విరుగుడుచేవ కావిడిపెట్టె. అది బయటకు లాగింది. ఏముంటాయందులో దాచుకోవటానికి. పాతగుడ్డలు, నవారు ముక్కలు, పెళ్ళినాటి పట్టుచీరా, పన్నీరుబుడ్డీ, విరిగిన గంధం గిన్నె, పడగ విప్పిన వెండిపుట్టసామీ, జ్ఞాపకాలతో పాటు వాటినీ

## అనివార్యం

ఇతిహాసాల సారం పిల్చి చిక్కబడిన అడవుల్లో
ఇష్టదేవతలపై కురిశాయట పచ్చటి వాస్తవాలు.
అర్థాలు రాలిపోయినప్పుడు కవిలోని రుషి కోసం
ఆకాశవాణి రచించిందట కొత్తచివుళ్ళు.

ఆనాడు సంకేతాలున్నాయి—అవి
అనవరత విశ్వాస కాంతి చిమ్మిన లతాంతాలు.
ఆనాడు ఔత్సుక్యాలు వీచాయి—వాటికి
యమునా తీరాన వెదుళ్ళలో దొరికాయి శుభాంతాలు.

సాహస గీతాలకు తలలూచే సస్యక్షేత్రాల్ని కాదని,
సావధానాలకు అల్లుకున్న నీడల్ని దాటుకుని,
అపరిచిత సిద్ధుడిచ్చిన పాదలేపం పూసుకుంటూ
అపూర్వ వైశాల్యాల్లో అడుగు పెట్టాము.......

అక్కడ ఎవరో కల్పవృక్షాలు నరుకుతున్నారు—
యంత్రాలతో కొత్త తుపానులు పరుస్తున్నారు—
'విన్న రొమాంటిక్ స్వప్నవనంలో
వినదించిన వాళ్ళంతా
నిజాయతీ లేనివా ళ్ళని అరుస్తున్నారు.

ఇష్టదేవతల్ని వెదుకుతూ వెళ్ళిన హవిర్ధూమం ఆచూకీ
ఇప్పటి రాడార్లకు అందదంటున్నారు.
కోపించిన ప్రకృతి ఎదుట గజగజలాడే తలిరాకులకు
క్లోరోఫిల్ యిచ్చినా లాభం లేదంటున్నారు.

తాతలనాటి పల్లకీలో పక్కనే కూర్చున్న పురుషుణ్ని
'క్రోతీ' అంటోంది ప్రకృతిలోని ఆడది.
మొన్ననే దేవుణ్ని తిరస్కరించిన ఎడారిలో
మునిలిదావిలా విల్పింది ఆత్మలాంటి జ్యోతి.

—వణుతుల రామచంద్రయ్య

మూటకట్టి అటకమీద పెట్టి, పెట్టె అమ్మేసింది. ఊళ్ళో ఎవరింట్లో పెళ్ళయినా తన దగ్గరకే వచ్చేవాళ్ళు. గంగాళం, రాగి బిందె, కళాయి దేగిశా, కూరల గుత్తి పట్టుకెళ్ళడానికి. ఎవరైనా అడిగితే ఏమొకం పెట్టుకు సెప్పాలిఅని కళ్ళుతడి చేసుకుంటూనే అవన్నీ కోటితో ఏలూరు పంపించి అమ్మించింది. యాపారం కోసం ఇంటి కప్పు కూడా పీకి అమ్మేదట్టుంది కన్నమ్మ- అని నవ్వుకున్నారు, జాలిపడ్డారు జనం. అనుకున్నదానికన్నా ఎక్కువే రద్దుగా పోయింది. చాలా తక్కువ మంది సవరాలు కట్టించి అమ్ముతారు. అందరూ పింజదీసి, సైజుల వారీగా కట్టిన కట్టలు కంపెనీవాళ్ళ క్కమ్ముతారు. పొడవు, నలుపూ, నొక్కుల్నాణ్యాన్ని బట్టి ధర పలుకుద్ది. కానీ కురసగా, బిరుసుగా ఉన్న కన్నమ్మ దగ్గర జుట్టు కొనడానికెవరూ ముందుకు రాలేదు. సవరాలుకట్టించే అమ్మాలని నిర్ణయించుకుంది. పని మొదలుపెట్టిం దగ్గర్నుంచీ కోటిని తన ఇంట్లోనే తిని వుండమంది. ఒక కిలో నల్లటి బారు వెంట్రుకలు, పావు కిలో నొక్కుల వెంట్రుకలు కొనుక్కొచ్చాడు కోటి. పైన బార్లువేసి క్రింద వుంగరాలజుట్టు పెట్టి చక్కటి సవరాలు తయారు చేసింది పార్వతి. చూసినవాళ్ళంతా ముచ్చటపడ్డారు. పొద్దున్నే లేచి అన్నీ సర్దుకుని కడుపునిండా అన్నం తిని కట్టిన సవరాలన్నీ పెద్ద సంచీలో వేసుకుని ఏలూరువెళ్ళాడు కోటి. సాయంత్రానికి రావలసినవాడు రాలేదు. అన్నీ అమ్ముకుని మర్నాటికొస్తాడనుకుంది. మర్నాడు రాలేదు.

మూడోరోజు ఖంగారుపడింది కన్నమ్మ. నాలుగోరోజు అనుమానించింది. అయిదోరోజు భయపడింది. ఆరోరోజు ఏడ్చేసింది. ఏడోరోజున పెంటమ్మ, రత్నం వచ్చి ఓదార్చారు. "మా యిల్లు బాగుజేయించుకోవాలి మేమిక్కడే ఉంటాం. సాయంత్రం మా సామానొస్తది ఇల్లు ఖాళీచేయి" అన్నారు. "పోనీలే నువ్వు మాత్రం ఎక్కడికెల్తావు. వసారాలో ఓ పక్క తడికట్టి వండుకు తిను—" అని దయగా అన్నారు.

కన్నమ్మకు నోటమాట రాలేదు. వెర్రి చూపు చూస్తున్న కన్నమ్మ దగ్గరకు పరుగెత్తి వచ్చింది మంగమ్మ.

"అత్తా.... చూశావా, మీ చిట్టి రానూ వచ్చింది, పోనూ పోయింది. నీకక్కురన్నా జెయ్యలేదు" అంది నిష్ఠూరంగా. "ఏలూరొచ్చి వారం రోజులుండి ఎళ్ళిపోయిందట. సూరయ్య చెప్పాడు." మళ్ళ అంది మంగమ్మ.

పక్కనేవున్న పార్వతి పరుగెత్తికెళ్ళి మంచినీళ్ళుతెచ్చి యిచ్చింది కన్నమ్మకు.

కన్నమ్మ చేయి వణికి గ్లాసు క్రింద పడిపోయింది. నీరసంగా కూర్చున్న చోట నుంచి లేచి నిలబడింది. నిలబడలేనట్లు పక్కనే వాల్చివున్న మంచం మీద కూచుంది. కూచోలేనట్లు మంచానికడ్డంగా వెనక్కు వాలిపోయింది.

గుడ్డిగవ్వల్లాగా, గాజుగోళీల్లా, కళమాసి పొడారిపోయి ఉండే ఆ కళ్ళు 'తడి తడిగా, కొడిగట్టిన ఆముదం దీపాల్లా మినుకు మినుకు మంటున్నై. పక్కన కూచుని చేతిలో చేయివేసి ఓదార్పుగా నిమిరింది మంగమ్మ.

మరీ గట్టిగా ఉన్నయ్యని తీసేసిన కాసిని ఉండలనూ పీకుతూంది సూరమ్మ. "పనికిరాక చుట్ట చుట్టి బయటకు పారేసినాటిని, చిక్కుదీసి, వన్నె జేసి దుర్వాసన పోగొట్టి ఉపయోగంలోకి తెత్తన్నాం. దుర్మార్గం అట్టలు గట్టుకుపోయింది లోకంలో.... ఆ చిక్కులెవరు తీస్తారు. సోర్ధంతో చెడువాసన గొడతంది పెపంచం. ఆ గబ్బెవరు కడుగుతారు. ఎటుచూసినా మోసం, సోర్ధం. అయ్యెట్టా పోతయ్యి" అనుకుందిమంగమ్మ- వడిలి రాలిన పువ్వులా పడివున్న కన్నమ్మను కన్నీళ్ళతో చూస్తూ.